ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా సంతోష్


ఇన్‌స్పెక్టర్ సంతోష్

అమీర్‌పేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా పోలిశెట్టి సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు నగర కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పైడి వెంకట రామప్రసాద రావును సీటీసీ, సీఏఆర్‌కు బదిలీచేశారు. 2002 బ్యాచ్‌కు చెందిన సతీష్ మొదట నిజామాబాద్ జిల్లా మాచారెడ్డి, పిట్లం, భీంగల్, దేవన్‌పల్లి, నవీపేట పోలీస్‌స్టేషన్‌లలో పని చేసి డీఐగా పదోన్నతి పొంది నగరానికి బదిలీపై వచ్చి గాంధీనగర్ ఎస్‌ఆర్‌నగర్‌లో డీఐగా పనిచేశారు. అనంతరం సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై వెస్ట్‌జోన్ ఎస్‌బీలో కొంతకాలం పనిచేసి చాదర్‌ఘాట్, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు.

కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్


చెక్కు అందజేస్తున్న రమేష్ తదితరులు

బేగంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలని.. వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బేగంపేట డివిజన్ శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన కార్యకర్త యాదయ్యయాదవ్ కుటుంబానికి 2 లక్షల రూపాయల విలువ చేసే ఇన్సూరెన్స్ చెక్కును స్థానిక నాయకులతో కలిసి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమ కోసం పార్టీ పని చేస్తోందన్నారు. అల్లంతోటబాయి రమేష్, జైపాల్, నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

కుష్ఠు నియంత్రణకు కృషి చేసిన డాక్టర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఆసియా బేగం

సనత్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు గురించి అవగాహన కల్పించడంతో పాటు, కుష్ఠు నివారణకు ప్రత్యేక కృషి చేసిన నిమ్స్ డెర్మటాలజి వైద్యురాలు ఆసియాబేగంకు వైద్యారోగ్యశాఖ ఉత్తమ అవార్డు అందించింది. నిమ్స్ డెర్మటాలజీ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ ఆసియా బేగం ఆస్పత్రికి వచ్చే రోగులకు కుష్ఠుపై అవగాహన పెంచడంతో పాటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు మెరుగైన వైద్యం అందించారు. ఆమె సేవలను గుర్తించిన వైద్యారోగ్యశాఖ ఆమెకు ఉత్తమ సేవ అవార్డుకు ఎంపిక చేసింది. యాంటీ లెప్రసీ డే సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓ నిర్మల ప్రభావతి, ఆసియా బేగంకు అవార్డు అందజేశారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఆసియాబేగంను అభినందించారు.


కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

పేదల కోసమే ఆధునిక కమ్యూనిటీహాల్

అమీర్‌పేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థమే ఎస్‌ఆర్‌నగర్‌లో ఆధునిక హంగులతో మల్టీలెవల్ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించినట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం వివిధ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి కమ్యూనిటీహాల్ నిర్మాణం పనులను పరిశీలించారు. డబుల్ సెల్లార్, జీ ప్లస్ వన్ విధానంలో సుమారు రూ. 11.92 కోట్ల వ్యయంతో పనులు చేపట్టినట్లు వివరించారు. అయితే పెరిగిన ధరల దృష్ట్యా రూ.12.96 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. డబుల్ సెల్లార్ పార్కింగ్ కోసం, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫంక్షన్‌హాల్, ఫస్ట్‌ఫ్లోర్‌లో డైనింగ్ హాల్ ఉండే విధంగా డిజైన్ చేసి నిర్మించడం జరిగిందన్నారు. కరోనా కారణంగా నిర్మాణం పనులలో జాప్యం జరిగిందన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ డీఈ రాధాకృష్ణ, ఈఈ ఇందిర, వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి పాల్గొన్నారు.


ఉత్పత్తులను పరిశీలిస్తున్న సందర్శకులు

ఆకట్టుకున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ

బంజారాహిల్స్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నాణ్యతకు మారుపేరు ఇండియన్ సిల్క్ గ్యాలరీలోని వస్త్రాలు చేనేతకళాకారుల ప్రతిభకు తార్కాణంగా నిలుస్తున్నాయని తెలంగాణా బీజేపీ మైనార్టీ మోర్చా వైస్ ప్రెసిడెంట్, ఫ్యాషన్ డిజైనర్ అల్క మనోజ్ అన్నారు. బుధవారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్‌గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చీరలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని చేనేత కార్మికుల ప్రతిభను ప్రశంశించారు. అందరూ చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకూ ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.



సమావేశంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

రెగ్యులరైజ్ చేయాలి

● సీఎంకు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల విజ్ఞప్తి

పంజాగుట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్లుగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నామని, స్టాఫ్ నర్సు ఫలితాల్లో ఉత్తీర్ణులైన తమను రెగ్యులరైజ్ చేయాలని పలువురు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఇస్లాముద్దీన్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో స్టాఫ్ నర్సు ఫలితాల్లో ఉత్తీర్ణులైన వారు పాల్గొన్నారు. సుమారు 600 మంది గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు సేవలందిస్తున్నట్లు వారు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నష్టపోయామని, సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు షేక్ సత్తార్ సాహెబ్, సొగరా బేగం, లాజర్, రాంచందర్, స్టాఫ్ నర్సుల ప్రతినిధులు ఎస్.చైతన్య, పి.సౌజన్య, వి.మంజుల, నిర్మల, సరిత పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి తదితరులు

దశలవారీగా అభివృద్ధి పనులు: మేయర్

బంజారాహిల్స్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ ఉదయ్‌నగర్, సింగాడికుంటలో రూ.12 లక్షలతో సీవరేజీ పైప్‌లైన్ పనులను ఆమె బుధవారం ప్రారంభించి మాట్లాడారు. బంజారాహిల్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించినట్టు తెలిపారు.

సీతమ్మలొద్దిలో రాతి చిత్రాల సంపద, గుహ

వెలుగులోకి తెచ్చిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం



రాతి చిత్రాలు, పాము పడగలా ఉన్న గుహను చూపుతున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం ప్రతినిధులు

పంజాగుట్ట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గట్టుసింగారం గ్రామంలోని సీతమ్మలొద్దిలో పాము పడగలా ఉన్న అతిపెద్ద రాతి గుహ, అద్భుతమైన రాతి చిత్రాల సంపద వెలుగులోకి వచ్చింది. ఆరున్నర కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డ నత్తగుల్ల శిలాజం, లక్ష సంవత్సరాల క్రితం నాటి రాతి గొడ్డలి, సూక్ష్మ రాతి పనిముట్లు, తొలి చారిత్రక యుగానికి చెందిన ఆరు శాసనాలు, చిత్రాలు వెలుగు చూశాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం గౌరవ సలహాదారుడు, ఫొటో జర్నలిస్ట్ డి.రవీందర్ రెడ్డి దీనిని వెలుగులోకి తెచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాతి చిత్ర నిపుణుడు, న్యూమిస్మాటిస్ట్ డాక్టర్ బండి మురళీధర్ రెడ్డి, సంస్థ కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, కో కన్వీనర్ గిరీష్, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి, ఆర్కియాలజిస్ట్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రవీందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. రామగిరి ఖిల్లా వెనకాల అడవిలో సీతమ్మలొద్దిలో గుహ ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో బృందంతో కలిసి వెళ్లానని తెలిపారు. పాము పడగలా 50 అడుగుల ఎత్తు, వెయ్యి అడుగుల పొడవు ఉన్న రాతి గుహ, మరో 6 గుహలను చూశామని తెలిపారు. ఇది దేశంలోనే రెండో, పొడవైన రాతి చిత్రాల గుహ అన్నారు. ఈ రాతి చిత్రాలలో మధ్యరాతి యుగం(12 వేల సంవత్సరాల నుంచి), తొలి చారిత్రక యుగంలో(క్రీస్తు శకం 1 నుంచి 6వ శతాబ్దం వరకు) వేసినవని తెలిపారు. రాతి చిత్రాలే కాకుండా చెక్కిన, ఎరుపు రంగులో వేసిన శాతవాహనుల కాలం నాటి ఐదు, విష్ణుకుండినుల కాలం నాటి ఒక శాసనం దొరికిందని, ఇవి తొలి చారిత్రక యుగానికి చేర్చిన కొత్త పేజీలని, వీటిలో శాతవాహనుల శాసనాలు తెలంగాణ చరిత్రను తిరగ రాసే ఆధారాలన్నారు. ఆరున్నర కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డ నత్తగుల్ల (గ్యాస్ట్రో పోడ్)శిలాజం ఈ ప్రాంత ప్రాచీనతను వెల్లడిస్తుందన్నారు. బృందం ఆధ్వర్యంలో మరిన్ని పరిశోధనలు చేసి తెలంగాణ చరిత్రను వెలుగులోకి తెస్తామన్నారు.

బ్రేక్ ఫెయిలై ఆర్టీసీ బస్సు బీభత్సం


బ్రేక్ ఫెయిలైన ఆర్టీసీ బస్సు

హయత్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. బస్సును నియంత్రించే ప్రయత్నంలో ముందున్న కారు, ఆటో, బైకులను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన బస్సు బుధవారం ఉదయం చౌటుప్పల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వస్తుండగా హయత్‌నగర్ సమీపంలోని భాగ్యలత కాలనీ ఆయాన్ డిజిటల్ భవనం వద్ద బ్రేకులు ఫెయిలై ముందున్న కారు, ఆటో, మూడు బైక్‌లను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న గోపీకృష్ణ, సత్యనారాయణ, బైక్‌పై ఉన్న వెంకటేష్, ప్రసాద్, మరికొందరు గాయపడ్డారు. వారిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ధర్మయ్య చాకచక్యంతో వ్యవహరించి హ్యాండ్‌బ్రేక్‌తో బస్సును ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో రాళ్లు ఎగిరి పడి బస్సు బ్రేక్ పైపులకు తగిలి ఉంటాయని, దాంతో బ్రేకులు పడి ఉండక పోవచ్చని అధికారులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంక్రిమెంట్ ఇప్పించండి

● జేఎన్‌టీయూ వీసీకి కాంట్రాక్టు ఆచార్యుల వినతి

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తమకు ఇంక్రిమెంట్ బకాయిలు వెంటనే ఇప్పించాలని జేఎన్‌టీయూ కాంట్రాక్టు ఆచార్యులు బుధవారం వైస్ చాన్స్‌లర్‌ను కోరారు. విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతి ఏటా రూ.1300 ఇంక్రిమెంట్ ఇవ్వాలని గత ప్రభుత్వం 2018 ఏప్రిల్‌లో జారీ చేసిన జీవో 11ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూలో 2011 నుంచి 224 మంది కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారని, అప్పట్నుంచి సర్వీసును పరిగణించాలని, ఇక్రిమెంట్‌ను వర్తింపజేయాలని వారు కోరారు. ఇతర యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ ఆచార్యులకు నెల వేతనం రూ.65 వేలు వస్తుండగా, తమకు రూ.43 వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఈ విషయమై వైస్ చాన్స్‌లర్ స్పందిస్తూ కాంట్రాక్టు ఆచార్యులకు 2018కి ముందు సర్వీసును పరిగణనలోకి తీసుకోవడం, అప్పట్నుంచే ఇంక్రిమెంట్, బెనిఫిట్స్ ఇచ్చే అంశాలను ప్రభుత్వానికి తెలియజేశామని, ఆర్థిక శాఖ నుంచి అనుమతి రాగానే అమలు చేస్తామని చెప్పారు. వీసీని కలిసిన వారిలో జేఎన్‌టీయూ కాంట్రాక్ట్ ఆచార్యుల సంఘం ప్రతినిధులు రాజేశ్‌ఖన్నా, శ్రీనివాస్‌రెడ్డి, దశరథం ఉన్నారు.

రద్దీలేని సమయాల్లో నగరంలోకి టిప్పర్లను అనుమతించాలి

డ్రైవర్ల ఆందోళన


నిరసన తెలుపుతున్న టిప్పర్ డ్రైవర్లు

బంజారాహిల్స్ జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పగటి వేళల్లో నగరంలో టిప్పర్ లారీలు తిరగొద్దని పోలీసులు పెట్టిన నిబంధనను ఎత్తివేయాలని గతంలో మాదిరిగానే రద్దీ లేని సమయంలో అనుమతివ్వాలంటూ బంజారాహిల్స్ టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్, కార్మికులు డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా చేపట్టిన మినీ టిప్పర్‌లారీ ఓనర్ల నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని దేవరకొండనగర్ బీఎస్‌ఆర్‌హిల్స్ వద్ద మినీటిప్పర్ లారీ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో నిర్మాణ వ్యర్థాలు తరలించేందుకు నగరంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతించేవారని తెలిపారు. కానీ ఇప్పుడు మినీ టిప్పర్ లారీలు పగటి వేళ నగరంలోనే తిరగొద్దంటూ అధికారులు నిబంధనలు విధించడం సరికాదని బంజారాహిల్స్ మినీటిప్పర్స్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్‌సాబేర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనను సవరించాలని వారు కోరారు. రెండు రోజుల్లో తగు నిర్ణయం తీసుకోవాలని లేదంటే నిరవధిక సమ్మె నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గిరి, నసీరుద్దీన్, నరేష్, వైస్ ప్రెసిడెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి బల్కంపేట ఎల్లమ్మతల్లి


శంకర విజయేంద్ర సరస్వతికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న రుత్వికులు

అమీర్‌పేట, జనవరి31 (ఆంధ్రజ్యోతి):శక్తి స్వరూపిణి ఎల్లమ్మతల్లి అని, దేశంలోని 18 శక్తిపీఠాలకు సమానమైన అమ్మవారిని పూజిస్తే సుఖశాంతులు సిద్ధిస్తాయని జగద్గురు ఆదిశంకరాచార్య కంచికామకోటి మూలమ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతి అన్నారు. ఎల్లమ్మ ఆలయంలో 5 రోజులుగా జరుగుతున్న శతచండీయుత మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా ఎల్లమ్మ, పోచమ్మ, నాగదేవత విగ్రహాలకు అభిషేకం చేసేందుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతికి రుత్వికులు, వేద పండితులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కుంట నాగరాజు, చైర్మన్ సాయిబాబాగౌడ్, ధర్మకర్తలు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. శతచండీయుత యాగంలో పాల్గొని అనంతరం రాజగోపురాలపై కళశాలకు మంత్ర జలంతో అభిషేకం నిర్వహించారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పార్టీ శ్రేణులతో కలిసి ఆలయాని విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు కాట్రగడ్డ ప్రసూన, మర్రి శశిధర్‌రెడ్డి అమ్మవార్లను దర్శించుకున్నారు. 5 రోజులుగా జరిగిన మహాకుంభాభిషేక మహోత్సవాలు బుధవారంతో ముగిసాయి.

'పెట్టుబడిదారులకు న్యాయం చేయాలి'

పంజాగుట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో పలువురి నుంచి పెట్టుబడి స్వీకరించి ప్రస్తుతం ఇబ్బందుల గురి చేస్తున్న సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రిటైల్ ఇన్వెస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (రివా) విజ్ఞప్తి చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు జి.శ్రీనివాసులు, ఇన్వెస్టర్లు ప్రదీప్, గణేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. సుమారు 40 ఏళ్ల క్రితం స్థాపించిన ఉత్తమ్ వాల్యూ స్టీల్ లిమిటెడ్(యువీసీఎల్)సంస్థలో సుమారు రెండు లక్షల మంది వరకు పెట్టుబడులు పెట్టారని చెప్పారు.

పాతకక్షలతో దాడి.. ఉద్యోగికి గాయాలు

మోతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాతకక్షతో తోటి ఉద్యోగిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. మాదాపూర్ సమీపంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మహ్మద్ రియాజ్ అహ్మద్ క్యాబ్ సూపర్‌వైజర్‌గా సయ్యద్ ఇర్ఫాన్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విధులు కేటాయించే విషయమై వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇర్ఫాన్ మూడు నెలల క్రితం ఉద్యోగం మానేశాడు. ఇర్ఫాన్ బుధవారం ఉదయం కంపెనీ బయట అహ్మద్‌పై కత్తితో దాడి చేసి పారిపోయాడు.



ట్రాఫిక్ అవగాహనపై ర్యాలీని జెండాఊపి ప్రారంభిస్తున్న బేగంపేట ఏసీపీ

వాహనాలపై స్టంట్స్, రేసింగ్‌లు ప్రమాదకరం

అమీర్‌పేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై స్టంట్‌లు, రేసింగ్, ట్రిబుల్ రైడింగ్‌లు ప్రమాదకరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఎస్‌ఆర్‌నగర్‌లోని లక్ష్య కాలేజ్ ఆఫ్ కామర్స్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడుతూ.. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఓవర్ స్పీడ్, డెంజరెస్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లు చూస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటునారన్నారు. 18 ఏళ్ల నిండిన అందరూ లైసెన్స్ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పై అవగాహన కల్పించేందుకు కళాశాల నుండి ఉమేష్‌చంద్ర విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ మురళి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్ ప్రారంభం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అమీర్‌పేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సేవా భారతి తెలంగాణ- ఏ నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న గచ్చిబౌలిలో రన్ ఫర్ ఎ చైల్డ్ 2024 5కే, 10కే 8వ ఎడిషన్ సన్నాహక పోస్టర్ జర్సీ మోడల్‌ని సేవా భారతి తెలంగాణ అధ్యక్షుడు దుర్గారెడ్డి, ఫ్రీడమ్ ఆయిల్ మార్కెటింగ్ జీ.యం చేతన్, గ్లోబల్ డాటా డైరక్టర్ సప్నా మయేరియాలు బుధవారం అమీర్‌పేటలోని హోటల్ ఆదిత్య పార్క్‌లో నిర్వహించిన సమావేశంలో ఆవిష్కరించారు. కిషోరీ వికాస్ (బాలిక సాధికారత) పై అవగాహన కల్పించేందుకు సేవా భారతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వాహిస్తున్నట్లు వెల్లడించారు. 2004లో ప్రారంభించినప్పటి నుంచీ ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే 15,000 మంది బాలికలకను ప్రభావితం చేసిందన్నారు. లక్ష మంది బాలికల జీవితాలను ప్రభావితం చేయడం తమ లక్ష్యమన్నారు. సమాచారం కోసం 9618036965లలో సంప్రదించాలని కోరారు.

భవనం విషయంలో వివాదం

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారా హిల్స్. జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లో ఖరీదైన భవనానికి సంబంధించి కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండగా దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై పలు సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిలింనగర్ నుంచి కొత్త చెరువుకు వెళ్లే ప్రధాన రహదారిపై ప్లాట్ నెం-5(సి)లో రెండంతస్తుల భవనం ఉంది. ఈ భవన యజమాని కృష్ణమూర్తి నుంచి 2017లో జూబ్లీహిల్స్ రోడ్ నెం-5లో నివాసం ఉంటున్న వ్యాపారి మారం సురేష్‌రెడ్డి లీజుకు తీసుకున్నాడు. సుమారు కోటిన్నర వ్యయంతో భవనాన్ని మోడిఫికేషన్ చేసి హైదరాబాద్ వైన్ మార్ట్ పేరుతో షాపు ఏర్పాటు చేశారు. అయితే అప్పటికే బ్యాంకులో రుణం తీసుకుని డిఫాల్టర్ అయిన విషయాన్ని దాచిపెట్టిన కృష్ణమూర్తి లీజుకు ఇవ్వడంతో కొన్నాళ్లకు ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు సురేష్‌రెడ్డికి నోటీసులు ఇవ్వడంతో ఆయన కోర్టును ఆశ్రయించాడు. కోట్లాది రూపాయలు పెట్టుబడి పెట్టిన తాను ఖాళీ చేస్తే భారీగా నష్టపోతానంటూ న్యాయస్థానంలో కేసు వేయగా అయనకు అనుకూలంగా 2018లో ఇంజెంక్షన్ ఆర్డర్ వచ్చింది. కాగా ఈ భవనాన్ని తాను కోనుగోలు చేశానంటూ ఇటీవల రాయలసీమ ప్రాంతానికి చెందిన చల్లా రామక్రిష్ణచౌదరి షాపును ఖాళీ చేయాలంటూ సురేష్‌రెడ్డిపై ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించారు. అయితే కోర్టులో తీర్పుకు అనుగుణంగా తాను నడుచుకుంటానని, అప్పటిదాకా ఖాళీ చేసేది లేదని తేల్చి చెప్పడంతో ఆయా కేసుల్లో రామక్రిష్ణ చౌదరి సైతం ఇంప్లీడ్ అయ్యాడు. ఈ కేసులన్నీ ప్రస్తుతం కోర్టులో వివిధ దశల్లో విచారణలో ఉన్నాయి. ఇదిలా ఉండగా మంగళవారం రామక్రిష్ణచౌదరితో పాటు సుమారు 30 మంది వ్యక్తులు కర్రలు, ఇనుప రాడ్లతో హైదరాబాద్ వైన్ మార్ట్ వద్దకు వచ్చి వీరంగం సృష్టించారు. షాపు బోర్డులు ధ్వంసం చేయడంతో పాటు సీసీ కెమెరాలు పగులగొట్టారు. సురేష్‌రెడ్డి, సిబ్బందిని బెదిరించి బయటకు తరిమివేశారు. ఇద్దరు వ్యక్తులు లోనికి వెళ్లి సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్‌లు, కౌంటర్‌లోని నగదు, ఇతర సామగ్రిని తీసుకుని షట్టర్‌కు తాళాలు వేసుకున్నారు. ఈ మేరకు బాధితుడు సురేష్‌రెడ్డి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐపీసీ 448, 427, 380, 506 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం సురేష్‌రెడ్డి వద్ద పని చేస్తున్న సిబ్బంది షాపు తెరుస్తుండగా మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో ఫిలింనగర్ పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

కిసాన్ అగ్రి షోలో 'పెర్‌ఫెక్ట్' ఉత్పత్తులు

● ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు ప్రదర్శన



'పెర్‌ఫెక్ట్' బాటిల్

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న క్రాఫ్ట్ ఫౌండేషన్, గ్లోబల్ గ్రీన్ అగ్రిసేవా నిర్వహణలోని 'పెర్‌ఫెక్ట్' బ్రాండ్ ఉత్పత్తులను హైదరాబాద్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు జరిగే కిసాన్ అగ్రి షోలో ప్రదర్శించనున్నారు. ఈ మేరకు సంస్థ బెంగళూరులో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వృక్ష ఆయుర్వేదంతో 11 వనమూలికల ఔషధ సమ్మేళనంగా ఉన్న 'పెర్‌ఫెక్ట్' మందు సమగ్ర సస్యరక్షణకు దోహదపడుతుందన్నారు. పంట పొలాలు, తోటల్లో అధిక దిగుబడి సాధించేలా రసాయనిక అవశేషాలు లేని విధంగా విస్తృత పరిశోధనల అనంతరం 'పెర్‌ఫెక్ట్'ను తయారు చేసినట్టు సంస్థ పేర్కొంది. వైరస్ బారి నుంచి పంటలను, తోటలను కాపాడే గొప్ప గుణాలు ఇందులో ఉన్నాయని గ్లోబల్ గ్రీన్ అధినేత టీఎస్.మూర్తి పేర్కొన్నారు. హైదరాబాద్ కిసాన్ అగ్రి ప్రదర్శనలోని బీ-120 పెర్‌ఫెక్ట్ స్టాల్‌ను రైతులు, తోటల పెంపకందారులు సందర్శించి ప్రయోజనం పొందాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్, కేపీకాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి ఉదయం 12.30 గంటల వరకు, ఎన్‌సీసీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఏసీబీ కార్యాలయం, కమ్మ సంఘం ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటట వరకు, బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 14 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఒమెగా, సత్యసాయి కల్యాణ మండపం ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

● గ్రీన్‌ల్యాండ్స్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. సనత్‌నగర్, మయూరిమార్గ్, హుడా ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎఫ్‌సీఐ గోడౌన్, లక్ష్మి కాంప్లెక్స్, చిరాన్ ఫోర్ట్, ఎంసీహెచ్ మార్కెట్, గ్రేహౌండ్స్ కార్యాలయం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

అలరిస్తున్న స్వల్ప వ్యవధి కచేరీలు

పంజాగుట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన సమితి వేద వేదాంత సంగీత సాహిత్య ప్రచారసభ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కమ్యూనిటీహాలులో త్యాగరాజ ఆరాధనోత్సవాలు, విజ్ఞాన సమితి సంగీతోత్సవాలలో భాగంగా స్వల్ప వ్యవధి కచేరీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

● ట్రాలీ పల్టీ



రహ్మత్‌నగర్ ఎస్పీఆర్‌హిల్స్ నుంచి గాయిత్రీహిల్స్ వెళ్లే మార్గం ప్రమాదకరంగా ఉండడంతో బుధవారం గాయిత్రీనగర్ వైపు వెళ్తున్న ట్రాన్స్‌పోర్ట్ ట్రాలీ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో ట్రాలీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ మార్గంలో ప్రమాదాలు జరుగకుండా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.
- యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

వెంగళరావునగర్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా సురేఖ


నియామకపత్రం అందుకుంటున్న సురేఖ

యూసుఫ్‌గూడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా బొమ్మిశెట్టి సురేఖ నియమితులయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్‌యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పి.కవిత చేతుల మీదగా నియామకపత్రాన్ని బుధవారం అందజేశారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

ఖైరతాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు పరీక్షించడం కోసం నిర్వహించిన మేనేజ్‌మెంట్ టాలెంట్ టెస్ట్‌కు మంచి స్పందన లభించింది. బుధవారం లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ), అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్, అంబిషస్ కేరీర్ కౌన్సిలర్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ కళాశాల మేనేజ్‌మెంట్ పరీక్షలో 50 కళాశాలల నుండి 820 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిని బధ్రుక కళాశాలకు చెందిన విశ్వతేజ్ అందుకోగా రెండో బహుమతి ఐఐఎంసీ కళాశాలకు చెందిన శ్రీలక్ష్మి, మూడో బహుమతి బధ్రుక కళాశాలకు చెందిన గిరీష్ గెలుచుకున్నారు. మరో ఐదుగురికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చినట్లు ఐఐఎంసీ ప్రిన్సిపల్ కూర రఘువీర్ తెలిపారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీ బందోబస్తు నిర్వహిస్తున్న జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీస్ అధికారులు, సిబ్బంది

రైల్వే స్టేషన్‌కు భారీ బందోబస్తు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రైల్వే అసిస్టెంట్ లోకో పైలట్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ క్రమంలో కొందరు పరీక్ష రాసిన అభ్యర్థులు ఫలితాలు రాకపోవడంతో ఏమైనా రైల్వే స్టేషన్‌లో విధ్వంసానికి పాల్పడతారా? అంటూ ముందస్తు జాగ్రత్తగా సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సలీమా పర్యవేక్షణలో డీఎస్పీ నరసయ్యతో పాటు జీఆర్‌పీ, ఆర్పీఎఫ్, సెంట్రల్ ఫోర్స్ పోలీసులు వందమందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రైల్వే ప్లాట్ ఫారంలపై బందోబస్తు నిర్వహించారు.

డీసీసీ కార్యదర్శిగా ఠాకూర్ హేమంత్‌సింగ్



అనిల్‌కుమార్‌యాదవ్ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న హేమంత్‌సింగ్

రాంగోపాల్‌పేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శిగా ఓల్డ్ బోయగూడకు చెందిన ఠాకూర్ హేమంత్‌సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ నియామక పత్రాన్ని హేమంత్‌సింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా హేమంత్ సింగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పెద్దలందరికీ కృతజ్ఞతలని, ముఖ్యంగా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారందరికీ చేరేలా చేయడమే కాక డివిజన్, నియోజకవర్గం, జిల్లాలో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.



రాజుకు వీడ్కోలు పలుకుతున్న తోటి ఉద్యోగులు

రైల్వేలో 53మంది ఉద్యోగుల పదవీ విరమణ

చిలకలగూడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 53మంది ఉద్యోగులు బుధవారం పదవీ విరమణ చేశారు. హెడ్‌క్వార్టర్స్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు పని చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వీడ్కోలు పలుకుతూ సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు సందడిగా మారాయి. అకౌంట్స్ విభాగం రైల్ నిర్మాణ్ భవన్‌లో సీనియర్ సెక్షన్ ఆఫీసర్ ఎం.రాజు, రైల్‌నిలయంలో సాయికృష్ణ, లేఖాభవన్‌లో ఆదిరెడ్డిలను కార్మిక సంఘ నాయకులు షేక్ రవూఫ్, చింతకుంట రామకృష్ణలు శాలువ, జ్ఞాపికలు అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావలసిన పెన్షన్, తదితర బకాయిలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడానికి అన్ని చర్యలు చేపట్టారు.

రైల్వేలో వెల్‌బేబీ షో

చిలకలగూడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్యరైల్వే మహిళా శిశు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లాలాగూడ, రైల్వే ఆస్పత్రిలో శనివారం ఉదయం 9గంటలకు వెల్‌బేబీ షో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు గావించినట్లు మెడికల్ డైరెక్టర్ తెలిపారు. లాలాగూడ పరిధిలో పని చేస్తున్న రైల్వే ఉద్యోగుల పిల్లలు 6 నెలల నుంచి 3సంవత్సరాల లోపు బాల, బాలికలు అర్హులు. డాక్టర్లు పిల్లల బరువు, ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాల ఆధారంగా బహుమతులు అందజేస్తారని, శుక్రవారం లోపు పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.



కార్యక్రమానికి హాజరైన కళాశాల నిర్వహణ కమిటీ, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం తదితరులు

ఎస్‌పీ కళాశాలకు ఫర్నిచర్ అందజేత

పద్మారావునగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.10లక్షల విలువైన క్లాస్‌రూం ఫర్నిచర్‌ను విజయవాడ కెనరా బ్యాంకు సర్కిల్ హెడ్(ఏపీ) జనరల్ మేనేజర్ పీ.రవివర్మ కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి రవివర్మను కళాశాల నిర్వహణ కమిటీ, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎస్.హేమలత, వైస్ ప్రిన్సిపాల్ అమరనాథ శర్మ, కళాశాల ప్రధాన కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, కోశాధికారి సూరజ్‌సింగ్, పరిపాలనా అధికారి రాహుల్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, కార్యదర్శి ఆర్.హరినారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంచి పీఠాధిపతి ఆశీర్వాదం పొందిన పురూరవరెడ్డి



మర్రి పురూరవరెడ్డిని ఆశీర్వదిస్తున్న కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతిస్వామి

పద్మారావునగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్, స్కందగిరి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బీజేపీ యువ నాయకులు మర్రి పురూరవరెడ్డి బుధవారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామిని కలిసి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి ఎల్ వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పీఆర్టీయూ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా శ్రీలత



తిరుమలగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఎన్నికల్లో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా బొల్లారం సదర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న శ్రీలత విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

వాహనాలపై కేసులు నమోదు

తిరుమలగిరి : నిషేధిత సమయంలో సిటీలోకి ప్రవేశించిన భారీ వాహనాల మీద తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 7గంటల నుంచి రాత్రి 11గంటల వరకు భారీ వాహనాలు సిటీలోకి ప్రవేశించకూడదు. అయితే నిబంధనలకు విరుద్ధంగా తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 7 భారీ వాహనాలు ప్రవేశించాయి. వాటిమీద క్రిమినల్ కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వాహనాల తనిఖీల్లో సబ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, రాంచందర్ పాల్గొన్నారు.

జింఖానా మైదానంలో ఆకట్టుకుంటున్న

వింటర్ ఉత్సవ్ మేళా



ఎగ్జిబిషన్‌లోని ఓ దృశ్యం

సికింద్రాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జింఖాన మైదానంలో నిర్వహిస్తున్న వింటర్ ఉత్సవ్ మేళాకు విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకులు రఫిక్ బేగ్ తెలిపారు. జంటనగరాలతో పాటు శివారు జిల్లాల నుంచి సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. అత్యంత అరుదైన వంద రకాల చేపలను సందర్శకులు ఆసక్తిగా తిలకించి, మురిసిపోతున్నారని చెప్పారు. అండర్ వాటర్ టన్నల్ నుంచి సముద్రం లోపలికి వెళ్లే విధంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్గం అందరినీ అబ్బురపరుస్తోందని రఫిక్ బేగ్ వెల్లడించారు. తెలంగాణ వంటకాలతో ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టు అందరినీ ఆకట్టుకుంటోందని, తెలంగాణ రుచులు ఆస్వాదించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను చూసేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని, వింటర్ ఉత్సవ్ మేళా ప్రతి రోజూ సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఉంటుందని ఆయన వివరించారు. సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

సంచారపురి కాలనీ అభివృద్ధికి సహకరిస్తా



సంచారపురి కాలనీలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్

బోయినపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి ఫిట్‌నెస్ చాలా అవసరమని, ప్రతిరోజు కనీసం ఒక్క గంటసేపు అయినా వ్యాయామం చేస్తే ఎలాంటి వ్యాధులు రావని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఒకటవ వార్డులో గల సంచారపురి పార్కులో స్థానిక కాలనీవాసులు తమ సొంత నిధులతో నూతనంగా షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ఏర్పాటు చేసుకున్నారు. ఈ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జంపన ప్రతాప్ స్థానికులతో కలిసి షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం కంటోన్మెంట్ బోర్డు ద్వారా గానీ, వేరే ఇతర నిధుల నుంచి గానీ నిధులు విడుదల చేయించాలని స్థానికులు జంపన ప్రతాప్‌కు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జంపన ప్రతాప్ వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని, సీఈవో దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరితగతిన వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తానని స్థానిక కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో కలిసి కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న క్రీడా మైదానాలను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జంపన ప్రతాప్‌ను ఘనంగా సత్కరించారు.

అవకాశం వస్తే ప్రజాసేవకుడిగా ముందుకు వస్తా

● మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డితో జంపన ప్రతాప్, మేకల సారంగపాణి, రాజేష్

బోయినపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధే ధ్యేయంగా సేవ చేస్తున్న ప్రధానిమోదీతో కలిసి పనిచేయడానికి అవకాశమిస్తే గతంలో రెండుసార్లు ఎంపీగా చేసిన అనుభవంతో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడిగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆయన బుధవారం సికింద్రాబాద్‌లోని గాయత్రి గార్డెన్స్‌లో కంటోన్మెంట్‌లో ఎలాంటి ఎన్నికలు వచ్చినా తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న కంటోన్మెంట్‌బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో పాటు ఆర్ఎస్ఎస్‌లో పనిచేసి సనాతన ధర్మాన్ని కాపాడుటకు తనవంతు కృషి చేస్తున్న రాజేష్ పటేల్, సికింద్రాబాద్ బీజేపీ నాయకుడు మేకల సారంగపాణితో కలిసి చాడ సురేష్‌రెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తనకు అవకాశం వస్తే సహాయ సహకారాలు అందించాలని వారిని కోరారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియాతో చాడ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, రాజకీయం, సంక్షేమంపై అవగాహన ఉన్న తాను ఈ ప్రాంతం ఎంపీగా పోటీచేసి ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన ఉందన్నారు. రాజకీయ పార్టీ ప్లాట్‌ఫాం ద్వారా తన సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే ఎన్నికల్లోకి రానున్నానన్నారు. ప్రజా ప్రతినిధిగా ఎన్నికవడానికి తగిన సామర్థ్యం తనకుందన్నారు. ఆర్థిక సామాజిక సేవా రాజకీయ అనుభవం ఉన్న తన లాంటి వారిని రాజకీయాల్లోకి రావాలని స్నేహితులు, మేధావులు, బంధువులు, తమ సామాజిక వర్గం కోరుతుందన్నారు. గతంలో తాను రెండుసార్లు ఎంపీగా గెలిచి ప్రజలకు సేవలందించిన అనుభవం తనకు ఉందన్నారు. ప్రస్తుతం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని సైనిక్‌పురి స్థానికుడినని, బీజేపీ తనకు అవకాశం కల్పిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచేందుకు కార్యక్రమాలు ప్రారంభిస్తానని ఆయన వెల్లడించారు. చాలా సంఘాల మద్దతు కూడగట్టినట్లు, ముఖ్యంగా తాను ఎక్కడికి వెళ్లినా మంచి స్పందన వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో మరోసారి పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో రాబోయే రోజుల్లో మనదేశం మరింత అభివృద్ధి చెందనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు తప్పవు



ఓల్డ్ బోయినపల్లి రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బోయినపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలతో పాటు కేసులు తప్పవని బోయినపల్లి ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరమణ అన్నారు. ఓల్డ్ బోయినపల్లిలోని సిటీ కేఫ్ వద్ద రోడ్లపైన ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తూ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ అవుతూ ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని స్థానికుల నుంచి బోయినపల్లి ట్రాఫిక్ పోలీసులకు భారీగా ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో బుధవారం బోయినపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య ఆదేశాల మేరకు ఓల్డ్ బోయినపల్లిలో ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో రోడ్లపై వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై భారీగా చలాన్లు విధించారు. అంతేకాకుండా పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు పెడతామని ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రోడ్లపై వాహనాలు నిలుపుతున్న వారిపై జరిమానాలు విధిస్తామని మరొకసారి సిటీకేఫ్ పైన ఫిర్యాదులు అందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. కార్యక్రమంలో బోయినపల్లి ట్రాఫిక్ పోలీసులు మహేశ్వర్‌రెడ్డి, చెన్నయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాయివర్ధన్(ఫైల్)

అడ్డగుట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. లాలాపేట్‌లోని సంతోషిమాత ఆలయం సమీప ప్రాంతానికి చెందిన సాయివర్ధన్(25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. జనవరి 30న మధ్యరాత్రి తన స్నేహితుడితో పాటు బైకుపై లాలాపేట్ అంబేడ్కర్ విగ్రహం మీదుగా మౌలాలి వైపు వెళ్తుండగా స్నేహితుడు బైకు నడుపుతుండగా సాయివర్ధన్ వెనుక కూర్చున్నాడు. ఈ క్రమంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద మూల మలుపు వద్ద బైకు అదుపు తప్పడంతో ఎదురుగా పార్కు చేసి ఉన్న ఆటోకు ఢీకొట్టాడు. బైకు నడిపిన స్నేహితుడికి కాలు విరుగగా వెనక కూర్చున్న సాయివర్ధన్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న లాలాగూడ పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించగా స్నేహితుడిని వైద్య పరీక్షల నిమిత్తం రైల్వే ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి గత కారణాలతో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం లాలాగూడ రైల్వే స్టేషన్ - సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మార్గ మధ్యలో గుర్తుతెలియని 40 ఏళ్ల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బ్రేక్ ఫెయిలై ఆర్టీసీ బస్సు బీభత్సం

● కారు, ఆటో, బైకులను ఢీకొనడంతో పలువురికి గాయాలు



బ్రేక్ ఫెయిలైన ఆర్టీసీ బస్సు

హయత్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. బస్సును నియంత్రించే ప్రయత్నంలో డ్రైవర్ ముందున్న కారు, ఆటో, బైకులను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన బస్సు బుధవారం ఉదయం చౌటుప్పల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వస్తుండగా హయత్‌నగర్ సమీపంలోని భాగ్యలత కాలనీ ఆయాన్ డిజిటల్ భవనం వద్ద బ్రేకులు ఫెయిలై ముందున్న కారు, ఆటో, మూడు బైక్‌లను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న గోపీ కృష్ణ, సత్యనారాయణ, బైక్‌పై ఉన్న వెంకటేష్, ప్రసాద్, మరికొందరు గాయపడ్డారు. వారిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ధర్మయ్య చాకచక్యంతో వ్యవహరించి హ్యాండ్‌బ్రేక్‌తో బస్సును ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో రాళ్లు ఎగిరి పడి బస్సు బ్రేక్ పైపులకు తగిలి ఉంటాయని, దాంతో బ్రేకులు పడి ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకయ్యనాయుడును సత్కరించిన మంద కృష్ణ



వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న మంద కృష్ణమాదిగ

సికింద్రాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్ పొందిన సందర్భంగా భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం వెంకయ్యనాయుడును కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ప్రజాజీవితంలో ఉంటూ, నైతిక మానవీయ విలువలతో రాజకీయాలకు సరికొత్త నిర్వచనంగా మారిన ఖ్యాతి వెంకయ్యనాయుడుకే దక్కిందని అన్నారు. వెంకయ్యనాయుడుకు పద్మవిభూషణ్ దక్కడం సంతోషకరంగా ఉందన్నారు. తన సమర్థత, చొరవ, హుందాతనంతో భారత ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తీసుకువచ్చారని వెంకయ్యనాయుడును అభినందించారు. స్వాతంత్ర్య ఫలాలు, రాజ్యాంగ ఫలాలు సమాజంలోని ప్రజలకు అందాలనే సంకల్పంతో రాజకీయ వేత్తగా ఎంతో కృషి చేసిన వెంకయ్యనాయుడు అన్ని కులాలకు అన్ని, వర్గాలకు సామాజిక న్యాయం జరగాలని తపించారని అన్నారు. అందులో భాగంగా మాదిగ ప్రజలకు చేస్తున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమానికి కొండంత అండగా నిలిచారని పేర్కొన్నారు. వెంకయ్యనాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ, ప్రజలతో మమేకమై సమాజానికి మార్గనిర్దేశకులుగా ఉండాలని మంద కృష్ణ ఆకాంక్షించారు.



శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసిన పీఠాధిపతి స్వామి శంకర్ విజయేంద్ర సరస్వతి

ప్రసన్న వేంకటేశ్వర ఆలయాన్ని సందర్శించిన స్వామి శంకర్ విజయేంద్ర సరస్వతి

బౌద్ధనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పున:నిర్మాణ పనులను మంగళవారం రాత్రి కంచి పీఠాధిపతి స్వామి శంకర్ విజయేంద్ర సరస్వతి పరిశీలించారు. ఆయన ఆలయ కమిటీ ప్రతినిధులతో సమావేశమై ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పున:నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకం జరుగకుండా అత్యంత వైభవంగా ఆలయ పున:ప్రతిష్ఠ జరగాలని ఆకాంక్షించారు. నిర్మాణ పనులను పరిశీలించి అన్ని శాస్త్ర ప్రకారం జరుగుతున్నాయని సుందరంగా తీర్చి దిద్దుతున్నారని కమిటీ ప్రతినిధులను అభినందించారు. త్వరలోనే మరో మారు ఆలయ పున:నిర్మాణ పనులను పరిశీలించేందుకు వస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వేణుగోపాలరావు, లక్ష్మీనారాయణ, ఈఓ రాజేష్‌కుమార్, సవతి వలినాయగం, ఇంజనీరింగ్ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, రవీంద్ర, కమిటీ ప్రతినిధులు బాల భాస్కర్, ఆత్మారామసూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, రాంచందర్ పాల్గొన్నారు.

జ్ఞానవాపి సమస్యపై కోర్టు తీర్పు చారిత్రాత్మకం

● తెలంగాణ బీజేపీ ధార్మిక పరిషత్ కన్వీనర్ సూర్య ప్రకాష్



తార్నాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జ్ఞానవాపి ఆవరణలో పూజలు చేసుకోవడానికి హిందువులందరికీ హక్కు ఉందని వారణాసి జిల్లా కోర్టు ఆదేశించడం చారిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ బీజేపీ ధార్మిక పరిషత్ కన్వీనర్ సూర్య ప్రకాష్ అన్నారు. ఈ మేరకు బుధవారం తార్నాకలోని తన కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. హిందు ధర్మం అనేది సనాతన ధర్మమని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విశ్వవ్యాప్తంగా ఉన్న హిందువులందరిదని పేర్కొన్నారు. హిందువుల మనోభావాలకు అనుగుణంగా న్యాయ వ్యవస్థ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

కిసాన్ అగ్రిషోలో 'పెర్‌ఫెక్ట్' ఉత్పత్తులు

● ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు ప్రదర్శన



'పెర్‌ఫెక్ట్' బాటిల్

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్రధానకేంద్రంగా సేవలందిస్తున్న క్రాఫ్ట్ ఫౌండేషన్, గ్లోబల్ గ్రీన్ అగ్రినోవా నిర్వహణలోని 'పెర్‌ఫెక్ట్' బ్రాండ్ ఉత్పత్తులను హైదరాబాద్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు జరిగే కిసాన్ అగ్రి షోలో ప్రదర్శించనున్నారు. ఈ మేరకు సంస్థ బెంగళూరులో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వృక్ష ఆయుర్వేదంతో 11 వనమూలికల ఔషధ సమ్మేళనంగా ఉన్న 'పెర్‌ఫెక్ట్' మందు సమగ్ర సస్యరక్షణకు దోహదపడుతుందన్నారు. పంట పొలాలు, తోటల్లో అధిక దిగుబడి సాధించేలా రసాయనిక అవశేషాలు లేని విధంగా విస్తృత పరిశోధనల అనంతరం 'పెర్‌ఫెక్ట్'ను తయారు చేసినట్టు సంస్థ పేర్కొంది. వైరస్ బారి నుంచి పంటలను, తోటలను కాపాడే గొప్ప గుణాలు ఇందులో ఉన్నాయని గ్లోబల్ గ్రీన్ అధినేత బీఎస్.మూర్తి పేర్కొన్నారు. హైదరాబాద్ కిసాన్ అగ్రి ప్రదర్శనలోని బీ-120 పెర్‌ఫెక్ట్ స్టాల్‌ను రైతులు, తోటల పెంపకందారులు సందర్శించి ప్రయోజనం పొందాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

పాతకక్షలతో దాడి.. ఉద్యోగికి గాయాలు

మోతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలు మనసులో ఉంచుకొని తోటి ఉద్యోగిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. మాదాపూర్ సమీపంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మహ్మద్ రియాజ్ అహ్మద్ క్యాబ్ సూపర్‌వైజర్‌గా సయ్యద్ ఇర్ఫాన్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విధులు కేటాయించే విషయమై వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇర్ఫాన్ మూడు నెలల క్రితం ఉద్యోగం మానేశాడు. కక్ష పెంచుకున్న ఇర్ఫాన్ బుధవారం ఉదయం 6 గంటల సమయంలో కంపెనీ బయట ప్రధాన ద్వారం వద్ద అహ్మద్‌పై కత్తితో దాడి చేశాడు. గాయపడ్డ రియాజ్ అహ్మద్‌ను సహచర సిబ్బంది ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో మాదాపూర్ ఎస్సై శ్వేత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఇర్ఫాన్ పరారీలో ఉన్నాడు.



సంగీత గురువులు జ్ఞానాంబ, విజయలక్ష్మిని సన్మానిస్తున్న జస్టిస్ నాగమారుతిశర్మ, కళా జనార్దనమూర్తి

త్యాగరాజ కీర్తనలు ప్రతి గుడిలో వినిపించాలి

● సీబీఐ కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ

చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి కీర్తనలు ప్రతి గుడిలోనూ వినిపించాలని, ఆయన అందరివాడని సీబీఐ కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ అన్నారు. త్యాగరాజస్వామి కీర్తనలు ఆధ్యాత్మికతకు ప్రతీకలని అన్నారు. సమ్మోహన స్కూల్ ఫర్ మ్యూజిక్ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో త్యాగరాజస్వామి 177వ ఆరాధన వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాగమారుతిశర్మ హాజరయ్యారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో సంగీత గురువు రమాప్రభ, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్మానం అందుకున్న ప్రముఖ సంగీత గురువులు జ్ఞానాంబ, విజయలక్ష్మి శిష్యబృందం త్యాగరాజస్వామి రచించిన కీర్తనలను ఆలపించారు.